




సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 16/, 16/2 ఆదిత్య నగర్, రాంజీ నగర్ వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాలలోని తనిఖీ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిష్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను అన్ని సచివాలయాల్లో ప్రణాళి కాబద్ధంగా నిర్వహించాలని, జగనన్న సురక్ష పథకం పారదర్శకంగా అందరికీ చేరువయ్యేలా ప్రతి సచివాలయం సెక్రెటరీ కషి చెయ్యాలి అని కమిషనర్ సూచించారు.


మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

నీ ఊరొచ్చా.. నీ సెంటర్ వచ్చా.. రా..!

- ◆అనిల్‌కు లోకేష్ మాస్ వార్నింగ్
- ◆నెల్లూరులో వైసిపి జెండా పీకేస్తారు..!
- ◆నగరం అభివృద్ధి చేసింది టిడిపినే
- ◆బహిరంగ సభలో లోకేష్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"నీఊరొచ్చా..నీ విఆర్‌సి సెంటర్ వచ్చా...రా వస్తావా..అభివృద్ధి గురించి మాట్లాడుకుందాం" అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు.యువగళం పాదయాత్ర మంగళవారం నెల్లూరు రూరల్ నుంచి నెల్లూరు నగరం చేరుకుంది. స్థానిక విఆర్‌సి సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ జిల్లాకు వచ్చినప్పటి నుంచి పిల్లబచ్చా రా అంటూ పిలుస్తున్నారని, నీ ఊరొచ్చా, నీ విఆర్‌సి సెంటర్ వచ్చా వస్తావా అభివృద్ధి పై చర్చించడానికి అని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో మున్సిపాలిటీ చరిత్రలో జరిగిన అభివృద్ధి జరిగిందన్నారు. రూ.4,500 కోట్లతో నగరంలో అభివృద్ధి చేశారన్నారు. మంత్రిగా నారాయణ చేసిన పనులు గొప్పవన్నారు. నెల్లూరు ప్రజలు పాలిచ్చే ఆవును వదిలి, దున్నపోతును తెచ్చుకున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక నెల్లూరులో ఆగిపోయిన అభివృద్ధి నా బాధ్యత అని చెప్పారు. " జగన్ మతం క్యాష్..జగన్ కులం క్యాష్. లక్షకోట్ల ఆస్తి ఉంది, లక్ష రూపాయల చెప్పులు వాడతాడు, వెయ్యి రూపాయల వాటర్ బాటిల్ తాగుతాడు. అయినా క్యాష్‌పై ప్రేమ చావలేదు." అన్నారు. బెంగుళూరులో ప్యాలెస్, హైదరాబాద్‌లో ప్యాలెస్, తాడేపల్లిలో ప్యాలెస్, ఇడుపులపాయలో ప్యాలెస్, ఇప్పుడు వైజాగ్‌లో ప్యాలెస్. అయినా జగన్ కి క్యాష్‌పై ఆశ తగ్గలేదన్నారు. సొంత పేపర్, టీవీ, సిమెంట్ కంపెనీలు, పవర్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. అయినా జగన్‌కి క్యాష్ మీద జగన్ కి ఆశ తగ్గలేదన్నారు. సిల్లీ బచ్చాకి సబ్జెక్ట్‌లో హాఫ్ నాలెడ్జ్..అవినీతిలో ఫుల్ నాలెడ్జ్. ఉందని అనిల్‌ను ఉద్దేశించి అన్నారు. సిల్లీ బచ్చా సిటీకి తెచ్చిన నిధులు నిల్లు.. నాలుగేళ్లలో పోగేసింది ఏందో తెలుసా? వెయ్యి కోట్లు అన్నారు. సిల్లీ బచ్చా భూకబ్జాల లిస్ట్, భూ దందాల మొత్తం ఈ రోజు నేను బయటపెడుతున్నానన్నారు. . దొంతాలి వద్ద బినామీలు చిరంజీవి, అజంతా పేరుపై 50 ఎకరాలు. విలువ రూ.10 కోట్లు, నాయుడుపేటలో 58 ఎకరాలు బినామీ పేర్లతో. విలువ రూ.100 కోట్లు, ఇనుమడుగు సెంటర్‌లో బినామీలు రాకేష్, డాక్టర్ అశ్విన్ పేరుతో 400 అంకణాలు. విలువ రూ.10 కోట్లు. ఇస్కాన్ సిటీలో బినామీల పేర్లతో 87 ఎకరాలు, విలువ రూ. 33 కోట్లు. అల్లీపురంలో 4వ డివిజన్ కార్పొరేటర్, డాక్టర్ అశ్విన్ (అనిల్ తమ్ముడు) పేరుతో 42 ఎకరాలు. విలువ రూ.105 కోట్లు. ఇందులో 7 ఎకరాలు ఇరిగేషన్ భూమి. 4వ డివిజన్ కార్పొరేటర్, డాక్టర్ అశ్విన్ (అనిల్ తమ్ముడు) పేరుతో 12 ఎకరాలు. విలువ రూ.48 కోట్లు. ఒక పెద్ద కాంట్రాక్టర్ నుంచి దశల వారీగా అనిల్ బినామీ చిరంజీవి కి కోట్ల రూపాయలు వచ్చాయన్నారు. బందా వనంలో శెట్టి సురేష్ అనే బినామీ పేరుతో 4 ఎకరాలు. విలువ 25 కోట్లు. దామరమడుగులో బావమరిది పేరుతో 5 ఎకరాలు. విలువ 4 కోట్లు. గూడూరు-చెన్నూరు మధ్యలో 120 ఎకరాలు లేపేశాడన్నారు. 40 ఎకరాల్లో లే అవుట్ వేసి అమ్మేస్తున్నాడన్నారు. ఆఖరికి కరోనాని కూడా క్యాష్ చేసుకున్నాడని, వ్యాపారస్తులను, ఆసుపత్రుల యజ మానులు, జ్యూవెలరీ షాపుల వారిని బెదిరించి కోట్లు కొట్టేశాడని విమర్శించారు. ఈ సభలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ పి. నారాయణ, నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, .వెంకటగిరి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు పాశం సునీల్‌కుమార్, పరసా రత్నం, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విఆర్‌సి సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతోన్న నారా లోకేష్

నెల్లూరులో జనసందోహం..!

-ఘన వీడ్కోలు, ఘన స్వాగతం

-దేశ నలుమూల నుంచి కళా బృందాలు రాక

-నగరంలో భారీ బహిరంగ సభ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి యువనేత , జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. నెల్లూరు నగర నియోజకవర్గానికి పి.నారాయణ ఘన స్వాగతం పలికారు. దేశంలోని పది ప్రాంతాల నుంచి కళాకారులను తీసుకొచ్చి స్వాగతం పలికారు. విఆర్‌సి సెంటర్‌వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. అక్కడ నుంచి గాంధీబొమ్మ, కనకమహల్, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, మీదుగా వెంకటేశ్వరపురం నుంచి సాలుచింతల వరకు చేరింది...

నారా లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం సాయంత్రం 4 గంటలకు నెల్లూరులోని అనిల్‌గార్డెన్ నుంచి ప్రారంభమైంది. నెల్లూరు రూరల్ ఎఎంల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు మూడు వేల మంది మహిళలతో లోకేష్‌కు వీడ్కోలు పలికారు. అక్కడ నుంచి మాగుంట లేవుట్, కేవిఆర్,ఆర్‌టిసి, మద్రాసు బస్టాండ్ మీదుగా విఆర్‌సి వరకు చేరకుంది. విఆర్‌సి వద్ద నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ పి. నారాయణ ఘన స్వాగతం పలికారు. దేశ నలుమూలల నుంచి 10 ప్రత్యేక కళాబృందాలు, గజమాలతో స్వాగత ఏర్పాట్లు చేశారు. హెలికాప్టర్ ద్వార పూలు చల్లించాలని నిర్ణయించారు. ఎస్‌పి సోమవారం రాత్రి అనుమతి ఇచ్చారు. వాతావరణ కారణంగా రద్దు చేసుకున్నారు. డ్రోన్లు ద్వార పూలు కురిపించారు. అడుగడుగునా గజమాలలు వేశారు. పాదయాత్ర, విఆర్‌సి వద్ద బహిరంగ సభ విజయవంతం కావడంతో ఆపార్టీ నేతలు జోష్‌లో కనిపించారు.


నెల్లూరులో నారా లోకేష్ కు ఘన స్వాగతం పలుకుతోన్న దృశ్యం

మహిళలపై హింసను అరికట్టాలని కోరుతూ

ఐద్వా ఆధ్వర్యంలో యాత్ర

28 నుంచి ఆగస్టు 9 వరకు - రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి వెల్లడి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా వ్యవస్థాపక నాయకురాలు మాణికొండ సూర్యావతి స్ఫూర్తితో ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేది వరకు యాత్ర నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి తెలిపారు. మంగళవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఐద్వా వ్యవస్థాపక నాయకురాలు మానికొండ సూర్యావతి 30వ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పాల్గొన్నారు. ముందుగా సూర్యావతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం రమాదేవి మీడియాతో మాట్లాడారు. ఏ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారో అటువంటి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు స్త్రీలకు లభించని పరిస్థితి ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం కాలం చెల్లినటువంటి మూఢా ఛారాలను, కాలం సాంప్రదాయాలను 'సనాతనం' అన్న పేరుతో, దేశ సంస్కృతి ఇదే అంటూ అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగమే ఓ బిజెపి ఎంపి సతీసహగమనం అనేది పుణ్యకార్యమని, ఇటీవల పార్లమెంట్‌లో మాట్లాడటం శోచనీ యమన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాల న్నారు. ఢిల్లీలో రెజ్లర్లు తమకు మానసిక వేధింపులు ఎదురౌతున్నాయని, తమకు న్యాయం చేయాలంటూ రోడ్కెక్కాల్సిన వచ్చిందన్నారు. మహిళా రెజ్లర్లు తమ బాధను దేశ ప్రధానికి చెప్పినా ఫలితం శున్యమన్నారు. పోలీసులకు చెప్పినా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభం కావడంతో ఎట్టికేలకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. అయినా వేధింపుల ఆరోపణలు ఎదు ర్కొంటున్న ఎంపి బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవడంలో వెనుకాడుతున్నారన్నారు. నగరంలో సొంత కుటుంబంలోనే ఒక వ్యక్తి బాలికపై ఆసిడ్ పోసి అత్యాచారయత్నం చేయగా తీవ్రంగా గాయపడిన ఆ బాలిక వైద్యశాలలో చికిత్సలు తీసుకుంటు మరణించిందన్నారు. ఒక పాఠశాలలో చదువుకుంటున్న బాలికపై స్కూల్ వాహనం డ్రైవర్ అత్యాచారం చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుందన్నారు. మహిళ ఉపాధ్యాయురాలిపై ఓ రౌడీషీటర్ అత్యాచారయత్నం చేశారన్నారు. ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడమే ఈ ఘటనలకు కారణమన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలని ఇటీవల వర్మ కమీషన్ సిఫారస్సు చేసిందన్నారు. ఆ బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరమందున్నారు. ఈ నేపథ్యంలో మహిళలపై జరిగే వివిధ రకాల హింసను అరికట్టాలని కోరుతూ ఈ యాత్ర చేపడతున్నామన్నారు. రాష్ట్రంలో ఛార్జీషీట్లు త్వరగా నమోదు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తు న్నప్పటికీ ఎన్ని రేప్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయో చెప్పాలన్నారు. నిందితులు ఎట్టిపరిస్థితుల్లో బెయిల్‌పై బయటకు రావడానికి వీల్లేదన్నారు. మహిళలకు సంబంధించిన కేసు విచారణ త్వరితగతిన పూర్తి చేసేందుకు అనువుగా ఫాస్టు ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. యాత్రకు మహిళలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శివకుమారి, షేక్ మస్తాన్‌బీ, ఐద్వా నగర, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.పద్మ, వి.సుబ్బమ్మ, షేక్ షాహీనాబేగం, ఎస్.వరలక్ష్మి ఉన్నారు.


మాణికొండ సూర్యావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఐద్వా నేతలు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి -గుడ్లూరు : పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం దగ్గర స్థానిక సిపిఎం, సిఐటియు కార్యకర్తలు అభిమానులు మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత స్థానిక సిపిఎం కార్యకర్తలు గుడ్లూరు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో పెరిగిన విద్యుత్ ఛార్జీలపై మండల సిపిఎం కన్వీనర్ జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. రైతులు, సామాన్య ప్రజల పైన విద్యుత్ ఛార్జీల భారాలు మోపడం సరికాదన్నారు. తక్షణమే విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని పాలకిర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం కార్యదర్శులు కొట్టే వెంకయ్య ,జి మల్లికార్జున, రైతు సంఘ నాయకులు దామ కష్ణయ్య, సుంకర విజయలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు సీతారామయ్య ఉన్నారు.



సీతారావమ్మకు నివాళి

ప్రజాశక్తి -కందుకూరు :ఐద్వా మాజీ నేత మువ్వా సీతారామమ్మ మూడో వర్ధంతి సందర్భంగా స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకు మున్వర్ సుల్తానా సీతారామమ్మ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్వర్ సుల్తానా మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో మహిళా సంఘం నిర్మాణంలో సీతారావమ్మ సేవలు ఎనలేనివన్నారు. ఆమె స్ఫూర్తితో అనేక అనేక ప్రాంతాల్లో మహిళా సంఘం కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలు వల్ల మహిళలపై హింస పెరిగిందన్నారు. మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎస్.కె మల్లిక, పట్టణ కార్యదర్శి ఎం పద్మ, ఎస్కే షాహిదా, ఎ ధనలక్ష్మి, సిపిఎం నాయకులు ఎస్ఎ గౌస్, టి వెంకట్రావు, ఎం ప్రసాద్, ఎస్ పవన్ కుమార్ ఉన్నారు.



గంజాయి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు డిఎస్‌పి ఎ రామచంద్ర, సిఐ వెంకట్రావు టౌన్ ఎస్ఐ హనీఫ్ కందు కూరు పట్టణంలోని బండ పాలెం ప్రజలతో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. బండపాలెం ప్రజలను, యువతను ఉద్దేశించి డిఎస్‌పి రామచంద్ర మాట్లాడుతూ కాలనీలో గంజాయి వాడకాన్ని నిర్మూలించడం గురించి అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిం చకూడదన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

వెంకటాచలం : వెంకటాచలంలోని బాలుర బిసి వసతి గహాన్ని మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సందర్శిం చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పగిడిపోగు కిరణ్ కిషోర్ మాట్లాడుతూ వెంకటా చలంలోని ప్రభుత్వ బిసి వసతి గృహంలో పరిశుభ్రత లోపించిందన్నారు.వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. బి సుకుమార్, సిసింద్రీ ఉన్నారు.



అల్లూరి సీతారామరాజుకు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు :భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోన్నతమైన శక్తి అని ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మన్యం వీరుడి 126 వ జయంతిని పురస్కరించుకొని ఎస్‌పి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి సీతారామరాజు సాగించిన సాయుధ పోరాట పటిమన వివరించారు.

జగనన్న లే అవుట్లలో పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించుకుని, నిర్మాణ పనుల్లో వారిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని హౌసింగ్ విభాగం అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. జగనన్న కాలనీల నిర్మాణ పనుల పురోగతిపై హౌసింగ్ విభాగం, మెప్మా, నగర పాలక సంస్థ అధికారులతో కార్యాలయంలోని ఏ.పి.జె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.జగనన్న కాలనీ లే అవుట్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులను కల్పించేందుకు అదనపు కార్మికులతో నిర్మాణ పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. హౌసింగ్ కార్పొరేషన్ ఈ.ఈలు, డి.ఈలు, ఏ.ఈలు, మెప్మా విభాగం అధికారులు, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయం అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'


నెల్లూరులో..

నెల్లూరు : సిఎంఆలోచనలతో ప్రజా సమస్యలకు సంతప్తికర స్థాయిలో పరిష్కారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "జగనన్న సురక్ష" పథకంతో అర్హులందరికీ సంక్షేమం సాధ్యమని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. స్థానిక రూరల్ నియో జకవర్గం పరిధిలోని 2, 26 డివిజనులోని 7 సచివాలయాల కేంద్రాలు, నగర నియోజకవర్గం పరిధిలోని 15, 39, 40 డివిజనుల్లోని మొత్తం 8 సచివాలయాల్లో మంగళవారం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక డివిజనుల కార్పొరేటర్లు, వైఎస్సార్ సిపి నాయకులు, నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేందుకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే డబ్బులు జమవుతున్నట్లు ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, నేకునాంపురం గ్రామ సచివాలయాల్లో మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ కెవిబిటి సుందరమ్మ, ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్, ఎంపిపి పొనుగోటి మౌనిక, జడ్పీటిసి ఇంటూరి భారతి, సర్పంచులు దార్ల కోటేశ్వరమ్మ, కొల్లూరి లక్ష్మమ్మ, ఆర్ఐ కుంచాల నరసయ్య, ఇఒఆర్‌డి సుమంత్, వైసిపి నాయకులు ఇంటూరి హరిబాబు, నలమోతు చంద్రమౌళి, కొల్లూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఉలవపాడు : మండలంలోని రామాయపట్నం, బద్దిపూడి గ్రామాల్లో మంగళవారం జరిగిన జగనన్న సురక్షిత కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అధికారిని చెంచమ్మ, మండల తహశీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.గత వారం రోజుల్లో గ్రామాల్లో జరిగిన పలు రకాల సర్వేలలో ప్రజలు కోరిన విధంగా వారి వారి సంబం ధించిన ధ్రువీకరణ పత్రము అందజేశారు. ఆయా గ్రామాల సర్పం చులు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.


వలేటివారిపాలెంలో..

లింగసముద్రం : జగనన్న సురక్ష ద్వారా గ్రామంలో అర్హులందరికీ ప్రభుత్వం 11 రకాల సేవలను అందిస్తుందని ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని విఆర్.కోట, మాలకొండ్రాయు నిపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ పాల్గొన్నారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాని చేపట్టారని ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్‌పిటిసి డాక్టర్ చెన్ను నళినిపద్మ, తహశీల్దార్ మీరావలి,ఎంపిడిఒ శేషుబాబు,ఎంపి వైస్ చైర్మన్ మేకనబోయిన శ్రీనివాసులు,వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి,జెసిఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్టారెడ్డి, సర్పంచ్‌లు వంటేల శ్రీనివాసులు, సవలం కొండమ్మ,వంకాయపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా 'ఇంటూరి' జన్మదిన వేడుకలు


కందుకూరులో..

కందుకూరు : కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పలువురు కార్యకర్తలు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి తమ అభిమానాన్ని చాటు కున్నారు. పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి నాగేశ్వరరావు , ఇతర నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు ఏర్పాటుచేసిన 47 కిలోల కేకును ఇంటూరి నాగేశ్వరరావు కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు గజమాలలు, శాలువాలతో నాగేశ్వరరావు దంపతులను సత్కరించారు. మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం , నియోజకవర్గ పరిశీలకురాలు కే కుసుమ కుమారి , మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాల్ రావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, ఇంకా రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గస్థాయి నేతలు, హాజరై నాగేశ్వరరావుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. లింగసముద్రం మండలం మొగిలిచర్ల, గుడ్లూరు మండలం మోచర్ల, కొత్తపేట గ్రామాలకు చెందిన ముగ్గురు చిరు వ్యాపా రులకు నాగేశ్వరరావు దంపతులు తోపుడు బండ్లు అందజేశారు. తాడేపల్లి పట్టణంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వద్ద పేదలకు భోజనం అందజేశారు.

'ఇంటూరి'కి లోకేష్ శుభాకాంక్షలు

ఇంటూరి నాగేశ్వరరావుకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్ ప్రాంతంలో జరుగు తోంది. నారా లోకేష్ , నాగేశ్వరరావుకు స్వీట్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.


వలేటివారిపాలెం : కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు ఆయన స్వగ్రామమైన బడేవారిపాలెంలోని స్వగృహంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు రెబ్బవరపు మాల్యాద్రి, బద్దిపూడి శిఖామణి, రాయపాటి శ్రీనివాసరావు, దార్ల సుబ్బారావు, బద్దిపూడి ఇసాక్, అత్యాల ఏసోబు తదితరులున్నారు.


లింగసముద్రంలో..

లింగసముద్రం :కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జీ ఇంటూరి నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన లింగసముద్రంలోని టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కందుకూరు వెళ్లి ఇంటూరి నాగేశ్వర రావుకి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, రాజారపు మాల కొండయ్య,బోడి సురేష్, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, జంపాల శివ,చిట్టితోటి బాలకోటయ్య, అడపా క్రిష్ణ,కిలారి రమణయ్య ఉన్నారు.

ఆన్‌లైన్ కోర్సు నిర్వహణలో

ఉత్తమ నిర్వహకునిగా షరీఫ్


షరీఫ్‌ని అభినందిస్తున్న కంచర్ల రామయ్య

ప్రజాశక్తి - కందుకూరు : నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్ హన్స్ డ్ లెర్నింగ్(ఎన్‌పిటిఇయల్) ఆన్ లైన్ కోర్స్ నిర్వహణలో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ లెక్చరర్ షేక్.మీరా షరీఫ్ కు ఉత్తమ నిర్వహకునిగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ మేరకు ఆయనకు లభించిన ప్రశంసా పత్రాన్ని మంగళవారం కరస్పాండెంట్ కంచర్ల రామయ్య-టెక్నికల్ డైరెక్టరు ప్లేస్ మెంట్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయ శ్రీనివాస్‌లు అభినందనలు తెలిపి పత్రాన్ని అందజేశారు. షరీఫ్ మాట్లాడుతూ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ప్రోత్సాహంతో కాలేజీ అకడమిక్స్ ఇన్ ఛార్జి ఎస్‌యం మీరావలి ఇచ్చిన ఆత్మ స్థయిర్యం తో రెండేళ్ళ క్రితం ఈ కోర్సు నిర్వహణా బాధ్యతలు చేపట్టానన్నారు. ఈ రెండేళ్లు రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు అత్యధికంగా కోర్సులో చేరడం, ఉత్తమ ఫలితాలు సాధించడం తనకు ఉత్తమ నిర్వహకునిగా ప్రశంసా పత్రం లభించిందని షరీఫ్ వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రవికుమార్, సిఎస్ఇ హెచ్ఒడి ఎం.ఎం.రాయుడు ఎగ్జామ్సెల్ ఇన్ ఛార్జి సీనియర్ లెక్చరర్ డాక్టర్ కె. సుబ్బారెడ్డి, మీరావళి, తమ డిపార్ట్ మెంట్ సహ చరులు వి.హరిబాబు, ఏడు కొండలు రూప సైన్స్ అండ్ హ్యుమానిటీస్ డాక్టర్ సురియా బేగం,సీనియర్ అధ్యా పకులు జి.ప్రసాద్ అందించిన సహాయ సహకారాలు మరువలేనివిగా ఆయన అభివర్ణించారు.

కాకాణి పూజిత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పొదలకూరు :మంత్రి కాకాణి కుమార్తె కాకాణి పూజిత జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పొదలకూరు కాకాణి యువసేన ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొదలకూరు నుంచి మంత్రి క్యాంప్ కార్యాలయానికి తెల్లవారుజామున చేరుకొని పూజిత కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె చేత కేక్ కట్ చేయించారు. అభిమానులు చూపించే ఆప్యాయతకు ఆమె ముగ్దురాలయ్యారు.. సన్నీ రెబల్, హర్ష, పవన్,శివా అశోక్,ప్రసాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన జితేంద్ర గౌడ్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరుకు చెందిన టిడిపికి చెందిన సీనియర్ బీసీ నాయకులు మన్నెం జితేంద్ర గౌడ్ మంగళవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌నుకలిశారు. యువగళం పాద యాత్రలో భాగంగా నెల్లూరులో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో జితేంద్ర గౌడ్ లోకేష్‌ను కలిశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం గట్టిగా కషి చేయాలని జితేంద్ర గౌడ్‌కు నారా లోకేష్ సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి -నెల్లూరు :ప్రశాంతి నగర్‌లోని బ్రహ్మానందపురంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్లో స్వతంత్ర సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతిని పురస్క రించుకొని స్కూల్ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలును ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్ర మాలలో భాగంగా విద్యార్థులు అల్లూరి సీతారామరాజు,వివేకానంద వేషధారణలో ఆహూతులను అలరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగ సాయి సూరి, సెక్రటరీ ఎ జయప్రకాష్, మాల కొండారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కష్ణ చైతన్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ద చూపుతున్నారని వ్యవసా య శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వరి గొండ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో నా డు-నేడు పథకం కింద నూతన హాస్పిటల్ భవ న నిర్మాణం కోసం మంత్రి శంఖుస్థాపన చేశారు. అయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 146 కొత్త అంబులెన్స్‌ల సేవలను ప్రారంభించారని తెలిపారు. వైసిపి నాయకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి, ఎంపీపీ స్వర్ణలత, గూడూరు విష్ణు మోహన్ రెడ్డి, ఇసనాక రమేష్ రెడ్డి, కన్వీనర్ ఉ ప్పల శంకరయ్య గౌడ్, తలమంచి సురేంద్ర బా బు, వెరిచర్ల శ్రీనివాసులు, జెడ్పిటీసి శేషమ్మ, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, ఆకుల మధు, జాయిం ట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, డిఎం అండ్ హెచ్‌ఓ, ఎంపిడిఒ హేమలత ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణం కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం సాయంత్రం ఎల్ఐసి ఉద్యోగులు అల్పాహారం పంపిణీ చేశారు. ఎఐఐఇఎ యూనియన్ 73వ వారోత్సవాలు జరుగు తున్నాయి. యూనియన్ నాయకులు పాఠశాలకు వెళ్లి విద్యార్థుల మధ్యలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ విజయ్‌కుమార్, యూనియన్ సభ్యులు ఎస్‌విఎస్ మల్లికార్జునరావు, షేక్ షబ్బీర్, పద్మనాభరావు, పి శ్రీని వాసరావు, సుకుమార్, లక్ష్మీనారాయణ, రామారావు, నారాయణ, ఏజెంట్లు ఉన్నారు.



మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి - లింగసముద్రం : మహిళల ఆర్థికాభివృద్ధికి తోట్పాటునిచ్చేందుకు బ్యాంక్ రుణాల క్రెడిట్ మేళా ఉపయోగపడుతుందని పలువురు పేర్కొన్నారు. లింగసముద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బ్యాంకు లోన్ల క్రెడిట్ మేళా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిం చారు. లింగ సముద్రం, తిమ్మారెడ్డిపాలెం, శాఖవరం మేనేజర్లు పాల్గొ న్నారు. లింగసముద్రం కెనరా బ్యాంక్ మేనేజర్ షేక్ షరిఫ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తమ బ్యాంకు తోడ్పాటు నిస్తుందన్నారు. ఎపిఎం సింహాద్రిరావు మాట్లాడుతూ మండలంలోని ఐదు బ్యాంకుల పరిధిలో 75 మంది లబ్ధిదారులు వచ్చారని, వారి వివరాలు బ్యాంకులకు ఇచ్చినట్లు తెలిపారు. మేనేజర్లు అవినాష్ బాబు, సుధీర్, మండలం సమాఖ్య అధ్యక్షు రాలు రవణమ్మ, సిసిలు మాధవ, శ్రీనివాసులు, మాధవరావు,నారాయణమ్మ ఉన్నారు.

డాక్టర్ డి.ఆర్. జయంతి



ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్ సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో మంగళవారం కావలి పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో అంగనవాడీ కేంద్రంలో విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, విద్యాప్రదాత, విద్యా జ్యోతి డాక్టర్ డి.ఆర్. జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్డ మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఐసిడిసి సూపర్‌వైజర్ సుహాసిని, వార్డ్ పోలీసు పవిత్ర, టీచర్ శారద కాలనీ వాసులు పాల్గొని నివాళు లర్పించారు. డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహరరెడ్డి మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు విద్యాసంస్థలు స్థాపించారని, డి.ఆర్. ఆశయాలను వివరించి, చదువు ప్రాముఖ్యతను వివరించారు. డైరెక్టర్ తాతిరెడ్డి మాట్లాడుతూ డి.ఆర్. నైతిక విలువలకు, మానవతా విలువలకు నిలువెత్తు నిదర్శనమని, లక్షలాది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపిన విద్యాప్రదాత, విద్యాజ్యోతి అని నివాళులర్పించారు. తదుపరి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో... రెడ్‌క్రాస్, రక్తదాన ఉద్యమాలకు పునాది వేసిన మహనీయుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి అని కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో డిఆర్ 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ రక్తదాత పెళ్లకూరి గోపిక్రిష్ణకు జెబి కళాశాలలో ఉద్యోగం కల్పించి, కావలి ప్రాంతంలో రక్తదాన ఉద్యమానికి పునాది వేశారని వివరించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి మరణానంతర సేవల విభాగం కన్వీనర్ పేరూరి కొండలరావు రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

108 వాహనం ప్రారంభం



ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం కేటాయించిన 108 వాహనాన్ని మంగళవారం మండల వైసిపి మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ మోహన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న 108 వాహనం మరమ్మతులకు గురై మండల ప్రజలు నిరాశ చెందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం నూతన వాహనం అధునాతన సౌకర్యాలతో మండల ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. మండల ప్రజలు అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఏపిలిగుంట ఎంపిటిసి హజరత్ రెడ్డి, గంగినేని రవీంద్రబాబు నారాయణస్వామి, వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, సూపర్‌వైజర్లు జావిద్, జగన్మోహన్, అంకిరెడ్డి, తిరుపతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణకు అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ నివారణ మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ నివారణ ఉత్సవాలను జులై 1 నుండి 31 వరకు ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు జావిద్, జగన్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని కుడితిపాలెం గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి వైసిపి నేత మావులూరు శ్రీనివాసుల రెడ్డితో కలిసి అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నాయుడు సురేష్ మాట్లాడుతూ కుడితిపాలెం గ్రామస్తుల ఎన్నో సంవత్సరాల కల నెరవేరి పోతుందని, దీని ద్వారా 3000 ఎకరాల పైచిలుకు ఆక్వా రంగం కరెంటులో ఓల్టేజ్ సమస్య లేకుండా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ జె.కృష్ణారెడ్డి, ఎడి సునీల్, కోల్లపూడి శ్రీనివాసులు, మెట్ట వెంకటరామిరెడ్డి, ఎస్‌కె సబ్జాన్, మత్స్యకార సొసైటీ చైర్మన్ సిగినం రవి, ఎల్లం వెంకీరెడ్డి పాల్గొన్నారు.

రామ్‌చరణ్‌ను కలిసేందుకు సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-కావలి : నెల్లూరులోని మైపాడు నివాసి, రామచరణ్ ఫ్యాన్ షేక్ మూజామిల్ (బాబు) తన అభిమాన నాయకుడిని కలవడానికి మంగళవారం నెల్లూరు నుండి సైకిల్ యాత్ర చేపట్టారు. అందులో భాగంగా కావలికి బాబు రాగా, కావలి పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఆలా శ్రీనాథ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలా శ్రీనాథ్, మణికంఠ, పవన్, పోబ్బ సాయి, సమ్మను వెంకట సుబ్బయ్య, సుధీర్, శరన్, మందా శ్రీను, చంటి, రిషికేష్, ప్రవీణ్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం

ప్రజాశక్తి-కావలి : తుఫాన్ నగర్ పాతమసీదు ఎదురుగా సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సంస్థ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, ఎమ్‌వియన్ ప్రసాద్ రావు, ఎమ్ అజిత్ బాబు, మసీదు పెద్దలు షేక్.మస్తాన్, సంయుక్త సేవా సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా భావించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఎంఇఒలు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కావలి రూరల్ : కావలి-1, కావలి-2 ఎంఇఒలుగా గోవిందయ్య, వెంకటసుబ్బయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి మండల పరిధిలో జరుగుతున్న నాడు - నేడు పనులు విద్యారంగ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.

'గడప గడపకు మనప్రభుత్వం'

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్ర స్థానిక పేటలో మంగళవారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గడపగడప కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను మభ్య పెట్టారన్నారు. వైసిపికి మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

బొల్లినేని జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-వరికుంటపాడు : మాజీ ఎంఎల్ఎ ఉదయగిరి టిడిపి ఇన్‌ఛార్జి బొల్లినేని వెంకట రామారావు పుట్టినరోజు పురస్కరించుకొని మంగళవారం వరికుంటపాడు టిడిపి శ్రేణులు ఉత్సాహంతో సంబరాలు జరుపుకున్నారు. తొలుత మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కలిగిరి బొల్లినేని క్యాంపు కార్యాలయంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్, మాజీ మండల కన్వీనర్ చంద్రా వెంకయ్య, తెలుగు యువత ముజే లక్ష్మీనారాయణ, నాదెండ్ల రాజా శ్రీకాంత్ యాదవ్, ఎస్‌సిసెల్ అధ్యక్షులు తాతపూడి లాభాన్, మాజీ ఎంపిటిసి నందిపాటి అరోను తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కలిగిరి : 2024లో ఉదయగిరిలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బొల్లినేని జన్మదిన వేడుకలను నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు, అభిమానులతో కలసి మంగళవారం కోలాహలంగా జరుపుకున్నారు. అనంతరం బొల్లినేని మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో కూలిపోయిందని, పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి ఒక్కసారి అవకాశం అనే నినాదంతో వచ్చి అసమర్థ పరిపాలన చేస్తున్నాడని విమర్శించాడు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, కన్వీనర్ కాకు మహేష్, సర్పంచులు పూసాల వెంగపనాయుడు, వర ప్రసాద్, సిహెచ్ తాతయ్య, వేళ్ళ నరేంద్ర, అబ్బయ్య చౌదరి, జయరామిరెడ్డి, వేణు, పేరేచర్ల సుబ్బారావు, ఊసామధు, చావా మహేష్, కట్ట వెంకటేశ్వర్లు, కొండప నాయుడు, జర్రా అంకిరెడ్డి, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

'యువగళం' నిర్వహణకు స్థల పరిశీలన



ప్రజాశక్తి-కావలిరూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం మహా పాదయాత్ర 7వ తేదీన కావలి నియోజకవర్గంలోకి వస్తున్న సందర్భంగా తగిన ఏర్పాట్లపై కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు స్థల పరిశీలన చేశారు. మండలంలోని తుమ్మలపెంట రోడ్డు, ఆముదాలదిన్నె సెంటర్ వద్ద పాదయాత్ర బస చేయడంపై రూరల్ మండల టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు.

వంగవీటి రంగా జయంతి

ప్రజాశక్తి-జలదంకి : వంగవీటి మోహన్‌రంగ 76వ జయంతి జలదంకి బస్టాండ్ సెంటర్లో మంగళవారం రంగా రాధా మిత్ర మండలి ఉదయగిరి నియోజకవర్గం నాయకులు నిమ్మలపల్లి రామ చైతన్య సుబ్బారావు, చక్రాల సురేష్ ఘనంగా నిర్వహించారు. నిమ్మలపల్లి శ్రీనివాసులు, కావలి కాపునాడు అధ్యక్షులు బండారు మహేష్, దేవరకొండ శ్రీనివాసులు, జలదంకి ఉపసర్పంచ్ మాలకొండ రెడ్డి, జనసేన నాయకులు సిద్ధు, ఆకుల వెంకట్, కృష్ణంశెట్టి దిలీప్, తోట మురళి, జానీ, పాలంకి వేణు, రఘు, మహేంద్ర, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశించారు. మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటనలో భాగంగా స్థానిక నేటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష సర్వీస్ డెలివరీ క్యాంపును సందర్శించారు. అనంతరం ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి నవజాత శిశు విభాగాన్ని సందర్శించి అందజేస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం బ్లడ్ స్టోరేజీ కేంద్రాన్ని, ఐసిటిసి రక్త పరీక్షల రూమును, రిజిస్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులతో సమావేశమై ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను, వైద్య పరికరాలు, ల్యాబ్స్ పరిస్థితి, వైద్యులు, వైద్య సిబ్బంది



ల్యాబ్‌లో వైద్య పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సదుపాయాలన్ని ఉన్నందున డెలివరీలను ఇంప్రూవ్ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. మానసిక వైద్య సేవలను ఆసుపత్రిలో అందించేలా చర్యలు తీసుకోవాలని డి.సి.హెచ్.ఎస్.ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి నాడు-నేడు కార్యక్రమం ద్వారా స్కూల్స్, ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను, జెడ్‌పి పాఠశాలను జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. నాణ్యతతో పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం గంగిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఎన్.సి.డి సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్.సి.డి సర్వేలో భాగంగా యాప్‌లో అప్‌లోడ్ నమోదును పరిశీలించి, వివరాలను కచ్చితంగా నమోదు చేయడంతో పాటు నూటికి నూరు శాతం సర్వే పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, డి.సి.హెచ్.ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ ఝాన్సీ రాణి, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దయాకర్, ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ సుధీర్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి



సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తున్న రైతుసంఘం నాయకులు

ఉదయగిరి - బండగానిపల్లి గ్రామ మధ్యలో మూడు కిలోమీటర్లు రహదారిని ఏర్పాటు చేసి నిర్మించాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలన చేస్తున్న కలెక్టర్ రైతు సంఘం నాయకులు కాకు వెంకయ్య కలిసి 20 సంవత్సరాల నుండి ఈ మార్గం ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఈ రహదారి లేక విద్య, వైద్యం, అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా బండగానిపల్లి గ్రామస్తులతో నిరసన వ్యక్తం చేశారు. 6 పంచాయతీలు వెయ్యిమంది ప్రజలు ఉంటున్న గ్రామాల మధ్య ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు రహదారి నిర్మించకపోవడంతో అనేకమంది ప్రాణాలు గాలిలో కలిశాయని తెలిపారు. గర్భిణులు, వృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రెవెన్యూ నుండి ప్రభుత్వ భూమి ఫారెస్ట్ అధికారులకు అప్పగించిందని తెలిపారు. ఆయినా ఇంతవరకూ ఈ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం బాధాకరమన్నారు. వెంటనే చర్యలు చేపట్టి కొండకింద ప్రాంత ప్రజలకు రహదారి ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఫర్జిన్ భాషా, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలో తోటల చెరువుపల్లి సచివాలయాన్ని మంగళవారం కలెక్టర్ ఎం.హరినారాయణన్ సందర్శించి ఆకస్మిక తనిఖీలు చేశారు. అక్కడ జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేలపై సమగ్రంగా విచారించారు. ఈ సచివాలయ పరిధిలో మూడు పంచాయతీలు ఉన్నాయని 261 కుటుంబాలు గ్రామాల్లో లేరని బతుకుదెరువు కోసం వలస వెళ్లారని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలాగా చూడాల్సిన బాధ్యత వలంటీర్లపైన ఉందని, వలంటీర్లు ఎలాంటి అలసత్వం వహించకుండా



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులతో పాటు, వలంటీర్లు, సర్పంచ్ పేర్నంపాటి పెద్ద మౌలాలి, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ దాసరి యర్ర ఓబయ్య, పిడుగు బాలచంద్ర, పగడాల మాలకొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

మేకపాటిని కలిసిన వినయ్ రెడ్డి

ప్రజాశక్తి-ఉదయగిరి : వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డిని మండల అధ్యక్షురాలు మూలే పద్మ వినయ్ రెడ్డితో రెడ్డి యువసేన, ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు



రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

కలిశారు. మంగళవారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో సమన్వయ కర్తను మర్యాద పూర్వకంగా మూలే వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో వారు కలిశారు. అనంతరం బుధవారం ఉదయగిరి హై స్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే నియోజకవర్గ స్థాయి వైసిపి సమావే శాన్ని విజయవంతం చేయాలన్నారు. నాయకులు కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఆత్మీయ సమావే శానికి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ మూలే సుబ్బారెడ్డి, ఎపి ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు నల్లిపాగు ప్రసాద్, రెడ్డి యువసేన అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సీతారామపురంలో కలెక్టర్ పర్యటన



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రజాశక్తి-సీతారామపురం

జగనన్న సురక్ష జగనన్నకు చెబుదాం, నాడు-నేడు పనులు, అంగన్‌వాడీ సెంటర్ల తనిఖీలు వంటి పలుచోట్ల తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా బాలాయపల్లి పంచాయతీలో వైసిపి ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డితో కలిసి జగనన్న సురక్ష ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం అర్హులైన ప్రజలందరికీ అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా అర్హత కలిగి ప్రభుత్వం అందించే పథకాలు చిన్న చిన్న సాంకేతిక కారణాలతోత అందకపోతే వారిని గుర్తించి వారికి మంజూరు చేస్తామన్నారు. అనంతరం బసినేనిపల్లి సచివాలయంలో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాల న్నారు. ప్రతిరోజూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అందులో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం వైపు దిశగా పని చేయాలన్నారు. స్థానిక జెడ్‌పి పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో పిల్లలకు రాగిజావ, గుడ్లు సక్రమంగా అందుతుందా.. లేదా.. అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆట స్థలాన్ని శుభ్రంగా ఉంచి, చుట్టూ ఫెన్సింగ్ వేసి సంరక్షించాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి వంటలను పరిశీలించారు. అనంతరం సంజీవరెడ్డి నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల గ్రోత్ చాట్‌ను పరిశీలించారు. బరువు ఎత్తు సక్రమంగా పెరగని పిల్లలు ఉంటే వారిని పిల్లలు డాక్టర్‌కు చూపించాలన్నారు. ప్రతినెలా 10వ తేదీలోగా పిల్లల పెరుగుదల నమోదు చేయాలన్నారు. గ్రామంలో కొంతమంది స్వయం శక్తి సంఘాల మహిళలు రుణాలు తమకు కాకుండా పురుషులకు ఇస్తున్నారని దానికి సీసీ సహకరిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి తెలిపారు. గ్రామంలో ఎంత మంది డ్రాపౌట్స్ ఉన్నారో గుర్తించి వారందరూ బడిలో ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి వైసిపి ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, డిఇఒ గంగా భవాని, డ్వామా పిడి వెంకట్రావు, జెడ్‌పి కోఆప్షన్ మెంబర్ తాజుద్దీన్, మండల వైసిపి కన్వీనర్ సిహెచ్ సుబ్బారెడ్డి, మండల వైస్ ఎంపిపి కృష్ణారెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లు పరిశీలన



ప్రజాశక్తి-ఉదయగిరి : అభిమానుల పరిచయ సభ ఏర్పాట్లను మంగళవారం మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ బుధవారం జరిగే అభిమానుల పరిచయ సభను నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అభిమానులు ప్రజల కోరిక మేరకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు, అందులో వైసిపి బలోపేతం కోసం అందరినీ కలుస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కలిసి పని చేసేందుకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, మాజీ కొట్టాలపల్లి సొసైటీ అధ్యక్షులు మూలే వినయ్‌రెడ్డి, మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ అధ్యక్షులు కల్లూరి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, అక్కుల్ రెడ్డి, యువ నాయకులు షర్పుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రజాశక్తి-ఉదయగిరి : మహానాడులో ప్రవేశపెట్టిన టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచల బాబు యాదవ్‌కు సూచించారు. మంగళవారం నెల్లూరు పట్టణంలోని అనిల్ గార్డెన్స్‌లోని యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. గతవారం రోజులుగా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలోని కందుకూరు కావలి, కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాలలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర వివరాలను జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వివరించారు. అనంతరం నియోజకవర్గంలో 10, 11వ తేదీ చేపట్టే యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం ఎపిఎం బుజ్జమ్మ మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళల బ్యాంకు లావాదేవీలు, సివిల్ నిర్వహణ సక్రమంగా ఉన్నవారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుకు ప్రతిపాదనలు పంపుతా మన్నారు. అర్హత కలిగిన వారికి రూ.2 లక్షల నుండి రూ.10 లక్షల వరకు రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకు మేనేజర్లకు అవకాశం ఉందన్నారు. మర్రిపాడు ఎపిజిబి బ్యాంకు మేనేజర్ రంజిత్ కుమార్, డిసిపల్లి కెనరా బ్యాంకు మేనేజర్ రవి కిరణ్, కృష్ణాపురం ఎస్‌బిఐ మేనేజర్ ప్రతాప్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు బజారులో రోడ్లపై అడ్డదిడ్డంగా ఆటోలు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని బిట్రగుంట ఎస్ఐ శేఖర్ బాబు అన్నారు. బజార్ సెంటర్లోని ఆటో కార్మికులతో మంగళవారం ఆయన మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు వెంటనే సమాచారం అందించా లని తెలిపారు. సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-అల్లూరు

జగనన్న సురక్షతో ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలు తక్షణమే పరిష్కారమవుతున్నా యని మండల ఉపాధ్యక్షులు గుమ్మడి సురేంద్ర పేర్కొన్నారు. మంగళవారం బీరంగుంట సచివాలయం వద్ద ప్రజలకు ఉచితంగా అనేక సర్టిఫికెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నార్త్ ఆములూరు సర్పంచ్ షేక్ కరిముల్లా షా ఖాదర్ లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ కనకదుర్గ భవాని, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్రీదేవి, ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, జెడ్‌పిటిసి చలంచర్ల వేణమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలను దృష్టిలో పెట్టుకొని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ప్రజలకు వరంలాంటిదని మండల అధ్యక్షులు, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గంగపట్నం కుడితిపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బయ్య, ఎంపిడిఒ, సర్పంచులు నిరంజన్, నాయుడు సురేష్, ఉడతా వెంకట శేషయ్య, పంబాల జనార్దన్ రెడ్డి, మహిధర్ రెడ్డి, ఫణి నాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : ప్రతి ఒక్కరికీ లబ్ధి కలిగించడమే జగనన్న సురక్ష పథకం ధ్యేయమని కావలి ఆర్‌డిఒ శీనానాయక్ తెలిపారు. మంగళ వారం మండలంలోని గట్టుపల్లి సచివాలయం పరిధిలో జగనన్నసురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ సిహెచ్ పద్మావతి, ఆర్ఐ బి.శ్రీనివాస్, వ్యవసాయ అధికారిణి బి.శైలజ, హౌసింగ్ ఏఈ ప్రసాద్, సర్పంచ్ కాకాని ప్రశాంతి, విద్యా కమిటీ చైర్మన్ వట్టికాల మాధవ, ఎంపిటిసి వరకుమారి, ఉపసర్పంచ్ గుమ్మలంపాటి సుబ్బా రావు, పంచాయతీ కార్యదర్శి జె.రేవతి, విఆర్ఒ చెన్న కృష్ణయ్య, మండల కన్వీనర్ చేవూరు జనార్దన్ రెడ్డి, నాయకులు కాకాని మహదేవయ్య, వట్టికాల మాల్యాద్రి, పి.మస్తాన్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, తదితరులున్నారు.

జలదంకిలోని బిట్-1 సచివాలయంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి కన్వీనర్ చేవూరు జనార్ధన్‌రెడ్డి హాజరై జగనన్న సురక్ష పథకాన్ని గురించి వివరించారు. ఎంపిడిఒ శ్రీధర్ బాబు, ఎపిఎం శ్రీధర్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ భరత్ కుమార్, ఇరిగేషన్ ఏఈ రోజ్‌మేరీ, సచివాలయాలు కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఎంపిటిసి కుట్టుబోయిన మాధవరావు, విఆర్ఒ పద్మావతి, పంచాయతీ సెక్రెటరీ బుజ్జమ్మలతో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.



బిట్రగుంటలో సర్టిఫికెట్లతో లబ్ధిదారులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం మంగమూరు పంచాయతీ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పంచాయతీ ఉప సర్పంచ్ రాయి వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పంచాయతీలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు పెట్టుకున్న అర్జీదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాయి వినోద్ యాదవ్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలలో ప్రజల్లో తీసుకొని వెళ్లేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కొండయ్య, స్థానిక నాయకులు, వినోద్ యాదవ్ యూత్, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమ్యలకు పరిష్కారం లభిస్తుందని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బోయిలచిరువెళ్ల సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలకు11 రకాలైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమలో తహశీల్దార్ లక్ష్మీ నరసింహ, సర్పంచ్ బొలిగెర్ల వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ ఎఒ కిషోర్ బాబు, ఎంపిపి అడ్మిన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి టి.ఉషారాణి, సచివాలయ కన్వీనర్లు చీరల వెంకటేశ్వర్లు, రావూరు శ్రీనివాసరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, హజరత్ రెడ్డి తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : 22, 23వ వార్డుల సచివాలయాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, కౌన్సిలర్ చెరుకూరు కామాక్షయ్య నాయుడు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణ్‌కుమార్, జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.ఆదిశేషయ్య పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనందరెడ్డి మాట్లాడారు. నాయకులు నోటి వినయ్ కుమార్ రెడ్డి, ఐవి రమణారెడ్డి, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, చెరుకూరు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నెల్లూరు టౌన్‌హాల్లో 6వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు వ్యవసాయ రంగం సంక్షోభం - ప్రభుత్వ విధానాలపై జరిగే సదస్సుకు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని మంగళవారం ఎపి రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణమోహన్, లక్కు కృష్ణ ప్రసాద్ ప్రకటన ద్వారా తెలియజేశారు. రైతు దేశానికి వెన్నెముక అని అలాంటి రైతులు దేశంలో రాష్ట్రంలో ఆత్మహత్యలు కొనసాగుతున్నా యని తెలిపారు. రైతులు ఎన్నో కష్టాలను ఉడుదుడుకులను ఎదుర్కొంటూ సమాజానికి అన్నం పెడుతున్నార న్నారు. అలాంటి రైతులకు గిట్టుబాటు ధర లేక దేశంలో అన్యాయం జరుగుతుందన్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చెప్పినట్లు పంట ఉత్పత్తి ఖర్చుకు 50శాతం కలిపి ఆ పంటలకు మద్దతు ధర నిర్ణయించి అమలు చేసి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సూచించగా, ప్రభుత్వాలు వాటిని పెడచెవిన పెడుతున్నాయని తెలిపారు. ఈ సదస్సులో రైతులు, కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు.



నిరసన జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి ఇందుకూరుపేట

10, 11 తేదీల్లో జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే 36 గంటల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇందుకూరుపేట అంగన్‌వాడీ సెక్టార్ నాయకురాలు స్వర్ణమ్మ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలలో భాగంగా తెలంగాణ కన్నా అదనంగా రూ.1000 వేతనం ఇస్తానని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే నిరసనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దయాసాగర్, వాసు పాల్గొన్నారు.

'అల్లూరి' జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అధికారి మృదుల తదితరులున్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మంగళవారం నగరంలోని డికెడబ్ల్యు కళాశాలలో ప్రిన్సిపల్, జిల్లా ఆర్ఐఒ శ్రీనివాసులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కరుణకుమారి, ప్రసన్న, భారతి, సుబ్బారెడ్డి, శ్రీదర్, శివయ్య, అల్లూరయ్య, కృష్ణతులసి, లత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి రూరల్ : కావలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జెడ్‌పిటిసి జంపాని రాఘవులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-జలదంకి : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాన్ని జలదంకి ఎంపిడిఒ కార్యాలయం లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి ఎంపిడిఒ శ్రీధర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : బ్రిటీష్ పాలకుల అకృత్యాలకు వ్యతిరేకంగా పోడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా కావలి సిపిఐ కార్యాలయంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబు ఆధ్వర్యంలో మంగళవారం సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదవపు మహేష్, శీనయ్య, రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని గ్రామ సచివాలయంలో సర్పంచ్ కొండేపోగు దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పూలమాలు వేసి ఘనంగా నిర్వహించారు. విఆర్ఒ శేషారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ శంశీర్, ఎనర్జీ అసిస్టెంట్ సుధీర్ బాబు, ఎఎన్ఎం జానకి పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రరావు, ఉపాధ్యాయురాలు మాలకొండమ్మ అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలను విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ తిరుపతమ్మ, జెవివి మండల అధ్యక్షులు మల్లికార్జున, విద్యార్థి పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తోడేటి మణి విద్యార్థులకు భోజనం ప్లేట్లు నోటు పుస్తకాలు పెన్సిల్ పెన్నులు బహుమతిగా అందజేశారు.